సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 25 । మే । 2023



పునర్వసు ప్రత్యేక పూజలు

వేములవాడ: రాజన్నను బుధవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ముగిసిన సీఎం కప్ క్రీడలు

యువతీయువకుల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించింది. మండలస్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రావతరణ దినోత్సవానికి మంత్రి కేటీఆర్



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో జూన్ 2న నిర్వహించే రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు హాజరవుతారు. వేడుకల్లో మంత్రి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించి ప్రసంగిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అవతరణ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజన్నకు రూ.85.80 లక్షల ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

వేములవాడ: రాజన్నకు 15 రోజుల్లో రూ.85,80,671 నగదు, 72 గ్రాముల బంగారం, 4.200 కిలోల వెండి సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు హుండీల ఆదాయం లెక్కించారు.

క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి



అవగాహన కల్పిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం మండలంలోని రుద్రవరం గ్రామంలోని అవగాహన కల్పించారు. కాంపిటీషన్‌లో యువత పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పోటీలో పాల్గొని బహుమతులు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ బస రాజశేఖర్, కత్తి కనుకయ్య, ఎర్రం ఆగయ్య ఉన్నారు.

‘యూపీఏ హయాంలో అంతా అవినీతే’



పుస్తకం అందజేస్తున్న రామకృష్ణ

వేములవాడ: 2004 నుంచి 2014 వరకు యూపీఏ హయాంలో దేశంలో అవినీతి రాజ్యమేలిందని, నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి దేశం పురోభివృద్ధి సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మోడీ 9 ఏళ్ల పాలనపై ముద్రించిన పుస్తకాలను బుధవారం వైద్యులు, పురప్రముఖులకు అందజేశారు. ఎంపీపీ బండ మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న సుధాకర్

సిరిసిల్లటౌన్: పోరాడితేనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. బుధవారం సిరిసిల్ల నెహ్రూనగర్‌లోని ఆర్‌ఎంపీ భవనంలో నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 21వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో విధులు నిర్వర్తించే మున్సిపల్ కార్మికులకు రూ.20లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పీఎఫ్ పెండింగ్ సమస్యలను వెంటనే రాష్ట్ర సర్కారు పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కోడం రమణ, గౌరవ అధ్యక్షుడు మూశం రమేష్, నాయకులు కాసారపు శంకర్, గుర్రం అశోక్, సుల్తాన్ నర్సయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కార్ఖానాలకు ‘షాక్’!

- 163 మరమగ్గాల కార్ఖానాలకు కరెంట్ సబ్సిడీ రద్దు
- రిజిస్టర్ పోస్ట్‌లో విద్యుత్ బిల్లులు.. నోటీసులు
- రాయితీ రద్దుతో రూ.47 లక్షల బిల్లింగ్
- ‘సెస్’ పాలకవర్గ సమావేశంలో చర్చ
- కోర్టు ఆదేశాల అమలుకు నిర్ణయం



సిరిసిల్లలో మరమగ్గాలు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. 163 మరమగ్గాల కార్ఖానాలకు విద్యుత్ రాయితీని రద్దు చేస్తూ ‘సెస్’ సంస్థ బుధవారం నోటీసులు జారీ చేసింది. 10 హెచ్‌పీల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న, ఎక్కువ సంఖ్యలో విద్యుత్ మీటర్లు కలిగి ఉన్న సాంచాల (పవర్‌లూమ్) కార్ఖానాలకు సబ్సిడీ రద్దు చేస్తూ 100శాతం బిల్లులు జారీ చేసింది. సిరిసిల్లలో చిన్న తరహా పరిశ్రమలు(ఎస్‌ఎస్‌ఐ) యూనిట్లుగా ఉన్న 127 మంది యజమానులకు చెందిన 163 కార్ఖానాలకు విద్యుత్ బిల్లులు, నోటీసులు రిజిస్టర్ పోస్ట్‌లో పంపించారు. సబ్సిడీ రద్దుతో సుమారు రూ.47లక్షల అదనపు విద్యుత్ బిల్లింగ్ అయింది.

మీటర్ల కేటగిరీ మార్పు



ఒకే చోట పది మీటర్లు

సిరిసిల్లలోని మరమగ్గాలను కుటీర పరిశ్రమగా గుర్తించి కేటగిరీ–4లో ప్రతీ యూనిట్ విద్యుత్‌ను రూ.4కు సరఫరా చేసేవారు. ఇందులో సగం అంటే ప్రతి యూనిట్‌కు రూ.2 ప్రభుత్వం భరిస్తుండగా, మరో రూ.2ను మరమగ్గాల యజమాని చెల్లించేవారు. ఇప్పుడు కోర్టు ఆదేశాలతో కేటగిరీ–4లోని మరమగ్గాలను కేటగిరీ–3గా మార్చారు. అంటే కుటీర పరిశ్రమను కమర్షియల్‌గా మార్చడంతో ప్రతి విద్యుత్ యూనిట్‌కు రూ.7 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఎలాంటి సబ్సిడీ లేదు. ఈ లెక్కన సిరిసిల్లలోని 127 ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు రూ.47 లక్షల మేరకు అదనపు బిల్లింగ్ అయింది. కేటగిరీని మార్చుతున్నట్లు ‘సెస్’ అధికారులు నోటీసులు, విద్యుత్ బిల్లులు జారీ చేశారు. ఆ బిల్లులను తీసుకునేందుకు మరమగ్గాల య జమానులు నిరాకరించడంతో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిణీ చేశారు. కొందరు రిజిస్టర్ పోస్టు తీసుకోగా, ఇంకొందరు రిటర్న్ పంపినట్లు సమాచారం.

‘సెస్’ పాలకవర్గం నిర్ణయంతో..

జిల్లాలో సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) విద్యుత్ పంపిణీ చేస్తుంది. 10 హెచ్‌పీల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే కార్ఖానాలకు 50 శాతం సబ్సిడీ రద్దు చేయాలని ఇటీవల కోర్టు ఆదేశించింది. ఈనేపథ్యంతో ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన జరిగిన పాలకవర్గం సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి రూ.46 కోట్ల విద్యుత్ రాయితీ బకాయిలు ‘సెస్’ సంస్థకు రావాల్సి ఉంది. వీటిన్నింటిపైనా చర్చించి కోర్టు ఆదేశాలు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ‘సెస్’ అధికారులు 163 కార్ఖానాలకు సబ్సిడీ రద్దు చేస్తూ నోటీసులు జారీ చేశారు.

ఫలించని ప్రయత్నాలు

కోర్టు ఆదేశాల నేపథ్యంలో సిరిసిల్లలోని 127 కార్ఖానాల యజమానుల ప్రతినిధులు ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు, మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణను సంప్రదించారు. రెండున్నర దశాబ్దాలుగా అమలులో ఉన్న 50 శాతం విద్యుత్ సబ్సిడీని రద్దు చేయొద్దని, బిల్లింగ్ చేయొద్దని కోరినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల నేపథ్యంలో తాము ఏమీ చేయలేమని, నిబంధనల మేరకు 10 హెచ్‌పీల వరకు సబ్సిడీ ఉంటుందని, అంతకు మించి విద్యుత్ వినియోగించే ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు సబ్సిడీ రద్దు చేస్తామని ‘సెస్’ చైర్మన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ‘సెస్’ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని వివరించినట్లు సమాచారం. మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉండగా, ఆయన రాగానే కలిసి విద్యుత్ సబ్సిడీ రద్దుపై చర్చించాలని ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల యజమానులు భావిస్తున్నారు. మరోవైపు కోర్టు ఆదేశాల అమలును నిలిపి వేసేలా మళ్లీ కోర్టును ఆశ్రయించాలని యజమానులు నిర్ణయించినట్లు సమాచారం. సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తి ఇప్పుడు ప్రారంభం కాగా, విద్యుత్ సబ్సిడీ ఎత్తివేయడం వస్త్రపరిశ్రమలో చర్చనీయాంశమైంది.

బిల్లులు తిరస్కరిస్తే మళ్లీ జారీ చేస్తాం



కోర్టు ఆదేశాల మేరకు సిరిసిల్లలోని 127 ఎస్‌ఎస్‌ఐ యూనిట్లను కేటగిరీ–4 నుంచి కేటగిరీ–3గా మార్చాం. ఈనెల నుంచే విద్యుత్ సబ్సిడీ లేకుండా బిల్లింగ్ చేస్తున్నాం. బిల్లులు, నోటీసులను వినియోగదారులకు రిజిస్టర్ పోస్టు చేశారు. ఎవరైనా తిరస్కరిస్తే మళ్లీ జారీ చేస్తాం. బిల్లింగ్ అయిన పక్షం రోజుల్లో బిల్లులు చెల్లించకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఎస్.రామకృష్ణ, ‘సెస్’ ఎండీ

కుదరని ఏకాభిప్రాయం

- రసాభాసగా దేశాయిపల్లి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ
- ఓటీఎస్ కావాలని కొందరు.. కాలనీ కోసం ఇంకొందరు
- అర్ధాంతరంగా ముగిసిన గ్రామసభ



ఆర్డీఓ ఎదుట మహిళల ఆవేదన

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వాసితుల ఆవేదన, మహిళల ఆందోళనల మధ్య రసాభాసగా మారి అర్ధాంతరంగా ముగిసింది. అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణంలో భాగంగా గ్రామంలోని పలువురి ఇళ్లు, భూములు ముంపునకు గురవుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో వేములవాడ ఆర్డీఓ పవన్ కుమార్, తహసీల్దార్ నరేశ్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ మాట్లాడుతూ, గతంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణానికి సుమారు 11 ఎకరాల స్థలాన్ని అప్పటి తహసీల్దారు గుర్తించగా, ఆ స్థలం వద్దని, తమ భూములు ఇవ్వమని రైతులు కోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చిందన్నారు. ఈ విషయమై కోర్టు తీర్పు వచ్చాక ఫైనల్ చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పీడీఎఫ్ జాబితా చదవాలని కొందరు అడుగగా, పీడీఎఫ్‌లు 143 వరకు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే ఒకసారి 119, మరోసారి 132, ఇప్పుడు 143.. ఎన్నిసార్లు పీడీఎఫ్‌లు మారుస్తారు..? పేర్లు చదవాలని గ్రామస్తులు కోరారు. ఈక్రమంలో పలువురు మహిళలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కోసం గుర్తించిన తమ స్థలం ఇవ్వమని ఆర్డీఓ ఎదుట స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఒకసారి పీఎన్ అయితే ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. కాగా కొందరు పరిహారం డబ్బులు వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)కింద ఇవ్వాలని, ఇంకొందరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కావాలని కోరారు. ఈక్రమంలో అధికారులు మాట్లాడుతూ, రూ.11 లక్షల వరకు ఓటీఎస్ కింద ఇచ్చే అవకాశం ఉందన్నారు. కానీ ప్రజల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పలువురు తమకు ఏం న్యాయం చేయడానికి వచ్చారని అడగడంతో ఎంపీపీ కల్పించుకున్నారు. ప్రజలు చెప్పిన ప్రతీ విషయాన్ని కలెక్టర్ దృష్టికి ఆర్డీఓ, తహసీల్దార్ తీసుకెళ్తారని చెప్పి సభ ముగించారు.

కలెక్టర్ రావాలని ఆందోళన

గ్రామసభ ముగింపు అనంతరం ఆర్డీఓ ఓ గదిలో విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో పీడీఎఫ్ జాబితా ఫైనల్ చేసేందుకు సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే ఆర్‌అండ్‌ఆర్ సమస్య వచ్చిందని, అందరూ వన్‌టైం సెటిల్‌మెంట్‌కు వస్తే పైఅధికారులకు చెప్పి పేమెంట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. కానీ ఇక్కడ ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. కాగా గదిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండడంతో కొందరు మహిళలు కలెక్టర్ రావాలి అంటూ నినాదాలు చేశారు. దీంతో చివరకు అధికారులు ఎటూ తేల్చకుండానే వెళ్లిపోయారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కొంకటి శిరీష, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు అభయ యాప్

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఆటోకు అభయ యాప్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: రాష్ట్రంలోనే రాజన్న ఆలయానికి ప్రత్యేక స్థానముందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. స్థానికులతోపాటు నిత్యం ఇక్కడికి వచ్చే వేలాది మంది ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అభయ మై ఆటో ఈజ్ సేఫ్ అనే యాప్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. బుధవారం టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన అభయ ఆటో భద్రత యాప్ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి భద్రత కల్పించేందుకు పోలీసుశాఖ ఈ యాప్ క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చిందన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఈ యాప్‌ను స్కాన్ చేస్తే పోలీసులకు వెంటనే ఆటో ఓనర్, డ్రైవర్ సమాచారం తెలిసిపోతుందని వివరించారు. అలాగే ఆటో లైవ్ లొకేషన్ పోలీసులకు షేర్ అవుతుందని, తద్వారా ప్రయాణికులకు ఎంతో భద్రత కల్గుతుందన్నారు. జిల్లాలోని ప్రతీ ఆటోకు వెనుక భాగం, ముందుభాగంతోపాటు లోపల కూడా క్యూఆర్ కోడ్‌తో ఉన్న యాప్ స్టిక్కర్‌ను అంటించడం జరుగుతుందన్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేసిన సమయంలో ఆటోలో యాప్ లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. షేరింగ్ ఆటోలు నడిపించవద్దని, ఒక్క ఆటోలో ముగ్గురికంటే ఎక్కువ మంది ప్యాసింజర్లను తీసుకెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, ఎస్సైలు వెంకట్రాజం, నాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు స్థాపించండి

- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: జిల్లాలో యువకులు ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకుని పరిశ్రమలు స్థాపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. సిరిసిల్ల జెడ్పీ ఆఫీస్‌లో బుధవారం జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిశ్రమల శాఖ ద్వారా అమలు జరిగే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ)లో 35 శాతం సబ్సిడీ అంటే.. రూ.20లక్షల వరకు రాయితీ లభిస్తుందన్నారు. ఈ పథకాన్ని యువకులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించడంతో పాటు, పది మందికి పని కల్పించవచ్చారు. మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా సజావుగా పూర్తి చేయాలన్నారు.

దళితబంధు యూనిట్లు ఆదర్శం

జిల్లాలో స్థాపించిన దళితబంధు యూనిట్లు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని అరుణ అన్నారు. మన ఊరు– మన బడిలో మంజూరైన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు చైర్‌పర్సన అధ్యక్షత వహించగా, వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమంపై తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అధ్యక్షతన జరిగాయి. జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, మ్యాకల రవి, గుగులోత్ కళావతి, యేసే వాణి, కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాష, అహ్మద్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీపీవో రవీందర్, పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు, డీఏవో భాస్కర్, జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య, జౌళిశాఖ ఏడీ సాగర్, ఉద్యానవన అధికారి జ్యోతి, మైనింగ్ ఏడీ సైదులు, భూగర్భ జలాధికారి నర్సింహులు, సీడీపీవో ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంపై ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. ముస్తాబాద్ రాజీవ్ విగ్రహం వద్ద బుధవారం బైఠాయించి ఆందోళన చేపట్టారు. రైతుల ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ, ముస్తాబాద్ కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం తూకం వేయడం లేదన్నారు. ఇప్పటికే తూకం వేసిన ధాన్యం బస్తాల్లో ఉందని, దీంతో నిర్వాహకులు ధాన్యం తీసుకోవడం లేదన్నారు. ట్రాక్టర్లు, లారీలు రాకపోవడంతో రవాణా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు. ధర్నాతో సిద్దిపేట, కామారెడ్డి వైపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎస్సై వెంకటేశ్వర్లు రైతులను సముదాయించారు. కేంద్రానికి తానే స్వయంగా వాహనాలు పంపిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో రైతులు బండి ప్రశాంత్, రాజు, కుమార్, బాలయ్య, బాపురెడ్డి, భూమయ్య, గౌండయ్య, కాంగ్రెస్, బీజేపీ నాయకులు యెల్ల బాల్‌రెడ్డి, బుర్ర రాములు, పెద్దిగారి శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, మీస శంకర్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కమిషనర్ అనిల్‌కుమార్ ధాన్యం కొనుగోళ్లపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో గన్నీ సంచుల కొరత లేకుండా, లారీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద వడ్లు అన్‌లోడ్ అయ్యేలా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లోని రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేసేందుకు అనుమతించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని అనురాగ్ జయంతి ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గుండెట్ల కడుక్కోవాలే..

- కల్యాణకట్టలో నీటి కష్టాలు
- గుండు గీయించుకుని అవస్థలు పడుతున్న భక్తులు
- పట్టించుకోని ఆలయ అధికారులు



తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు



నీటి సరఫరా నిలిచిపోయిందని చూపిస్తున్న భక్తులు

వేములవాడ: రాజన్న ఆలయానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నా.. కల్యాణకట్టలో సౌకర్యాలపై సంబంధిత అధికారులు అశ్రద్ధ చూపుతున్నారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే కల్యాణకట్టలో నీటి సరఫరా నిలిచిపోయి భక్తులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడంలేదు. మిడ్ మానేరు నుంచి నేరుగా నీటి సౌకర్యం ఉన్నా.. కల్యాణకట్టలో స్నానాలు చేసేందుకు నీళ్లు లేకుండా చేస్తున్నారని అధికారుల తీరుపై భక్తులు మండిపడుతున్నారు. పక్షం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినా అధికారులు పట్టించుకున్న పాపానపోవడంలేదంటూ అక్కడ విధులు నిర్వహించే నాయీబ్రహ్మణులు వాపోతున్నారు.

ఎక్కడ స్నానం చేయాలే..



మాది కామారెడ్డి జిల్లా దోమకొండ. కుటుంబ సభ్యులతో కలిసి రాజన్నకు తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చాం. నేను గుండు కొట్టించుకున్న కానీ కల్యాణకట్టలో మాత్రం నీళ్లు రావడం లేదు. గుండు తీయించుకున్న భక్తులు నీటి కోసం ఎటు వెళ్లాలో ఎవరూ చెప్పడం లేదు. ఆలయ అధికారులు సమస్యను పట్టించుకోవాలి.

– బాలయ్య, భక్తుడు,దోమకొండ, కామారెడ్డి

ఇబ్బందులు పడ్డాం



వేసవి సెలవులు కొనసాగుతున్నాయని కుటుంబ సభ్యులతో రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చాం. కల్యాణకట్టలో నల్లాల వద్దకు వెళ్తే ఒక్క నల్లా నుంచైనా నీళ్లు రావడం లేదు. చాలా ఇబ్బందులు పడ్డాం. వెంటనే నీటి సౌకర్యం కల్పించాలి.

– ప్రసాద్, భక్తుడు, బెల్లంపల్లి

నీటి సరఫరా పునరుద్ధరిస్తాం



కల్యాణకట్టలోనే కాదు భక్తులు ఉండే ప్రతీ ప్రదేశంలో నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కల్యాణకట్టలో నీటి సరఫరా పునరుద్ధరించాలని సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించాం. భక్తులకు ఇక్కట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది.

– దావు కృష్ణప్రసాద్, ఆలయ ఈవో

క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎల్లారెడ్డిపేట : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఎల్లారెడ్డిపేట, మరిమడ్ల విద్యాలయాల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ వెంకన్న తెలిపారు. గిరిజన బాలురు, బాలికలకు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 29న ఎల్లారెడ్డిపేట ఏకలవ్య గురుకులంలో ఎస్సెస్సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. పదో తరగతిలో సాధించిన జీపీఏ ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

నిప్పంటుకొని గడ్డి దగ్ధం

కోనరావుపేట : మండలంలోని పల్లిమక్త గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డి, మోటారు పైపులు కాలిపోయాయి. బుధవారం పొలంలోని వరిగడ్డికి నిప్పంటుకోవడంతో నాయిని ప్రభాకర్‌రెడ్డికి చెందిన బోరు మోటారు వైరు, కదిరె లచ్చిరెడ్డి, నాయిని మల్లారెడ్డికి చెందిన పొలాల్లోని వరి గడ్డి, యాదరవేణి గంగరాజు రైతు పొలంలో పైపులు, బోరు వైరు కాలిపోయాయి. ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా అన్నది తెలియాల్సి ఉంది.

'కుక్కల బెడద తగ్గించండి'


మాట్లాడుతున్న బియ్యంకార్ శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్: జిల్లాకేంద్రంలో కుక్కల బెడదను తగ్గించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని అన్నివార్డులో కుక్కల బెడద ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పలుసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అందుకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధురాలి మృతి

కోనరావుపేట (వేములవాడ): ఆకలితో అలమటిస్తూ, ఎండదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు మూడురోజుల క్రితం మృతిచెందగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మలక్పేటకు చెందిన సింగిడి దేవవ్వ (90)కు భర్త, పిల్లలు లేకపోవడంతో కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటోంది. గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం గడిపేది. మూడు రోజులుగా దేవవ్వ కనిపించకపోయే సరికి బుధవారం గుడిసెలోంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించారు. కాగా అప్పటికే మృతిచెంది ఉంది. నాలుగైదు రోజులుగా నుంచి ఆహారం లభించక మృతిచెందిందా లేదా వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తులు విరాళాలు పోగు చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

టీజీబీలో గొడవ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) ఉద్యోగి ఖాతాదారుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బుధవారం పావలా వడ్డీ రుణం వాపసు తీసుకునేందుకు మండల కేంద్రానికి చెందిన సద్ద శోభ బ్యాంకుకు వెళ్లింది. అక్కడే ఉన్న సిబ్బందికి విషయం తెలపగా ఇవ్వమని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. అధికారులు మందలించడంతో గొడవ సద్దుమణిగింది. ఖాతాదారు శోభకు పావలా వడ్డీ డబ్బులు వాపసు ఇస్తామని చెప్పడంతో వెనుదిరిగింది.

ముగిసిన సీఎం కప్ క్రీడలు

- మూడు రోజులపాటు ఉత్సాహంగా..
- సత్తాచాటిన క్రీడాకారులు
- 28 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయి పోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల అర్బన్ : యువతీ, యువకుల్లోని క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించింది. ఈనెల 15 నుంచి మండలస్థాయిలో పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 22 నుంచి సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు నేటితో ముగిశాయి. జిల్లాలోని పలు మండలాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. మూడురోజుల పాటు కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ మ్మింగ్, జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 28నుంచి 31 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

క్రీడాకారుల అసహనం

సిరిసిల్ల అర్బన్: సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానోత్సవంలో వాగ్వాదం చోటుచేసుకుంది. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. కొందరికే బహుమతులు అందజేయడంతో క్రీడాకారులు ఆందోళనకు దిగారు. కొన్ని క్రీడలకు మాత్రమే ప్రథమ, ద్వితీయ బహుమతులిచ్చి మిగిలిన క్రీడలకు ఒకే బహుమతి అందజేయడమేంటని అధికారులను ప్రశ్నించారు. దీనిపై సంబంధిత అధికారిని వివరణ కోరగా నిబంధనల ప్రకారమే బహుమతుల ప్రదానం చేశామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పీఈటీలు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



మాది ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి. మండలస్థాయిలో వాలీబాల్ పోటీల్లో మా జట్టు విజయం సాధించింది. బుధవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది.

రాష్ట్రస్థాయిలో రాణిస్తా



మాది సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడు గ్రామం. జిల్లా స్థాయిలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచా. రాష్ట్రస్థాయిలో విజయం సాధిస్తానన్న నమ్మకం ఉంది. – మ్యాక ప్రదీప్, రగుడు

క్రీడలంటే ఇష్టం



పాఠశాల స్థాయి నుంచే క్రీడలంటే ఇష్టం. డిగ్రీపూర్తి చేశాను. జిల్లాస్థాయిలో నిర్వహించిన షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో గెలుపొందాను. ఇలాంటి క్రీడలు గ్రామీణ ప్రాంత యువతకు ఎంతగానో దోహదపడుతాయి. – అందె భరత్, ఎల్లారెడ్డిపేట

పరుగు పందెంలో రాణించా



వంద మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో గెలుపొందాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. రాష్ట్ర స్థాయిలో రాణించి సీఎం కప్ సాధించడమే లక్ష్యం. – శిరీష, వేములవాడ రూరల్


కోడె మొక్కు చెల్లించుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సేవలో ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: రాజన్నను బుధవారం రాత్రి ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులకు ఈవో కృష్ణప్రసాద్, ఆలయ అర్చకులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎస్పీ రాజన్నకు ప్రత్యేక పూజలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

నాణ్యత లేమితో కరకట్ట నిర్మాణం


మాట్లాడుతున్న చాడ వెంకట రెడ్డి

- సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకటరెడ్డి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల కరకట్ట తీర రైతుల పొలాలను మధ్యమానేరులో ముంచారని సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. బుధవారం మానేరు తీరంలోని రైతుల పొలాల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరకట్ట నాణ్యత లేమితో నిర్మించడం మూలంగానే రైతుల పొలాల్లోని మధ్యమానేరు బ్యాక్‌వాటర్ వచ్చి చేరిందన్నారు. ఏటా రైతులు రెండు పంటలు పండించేవారని, అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారికి కన్నీరే మిగిలిందన్నారు. ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైతులకు నష్ట చెల్లించాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మృత్యుంజయం

చందుర్తి(వేములవాడ): పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ నాయకుడు కటకం మృత్యుంజయం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పెరుక కమ్యూనిటీ హాల్‌లో జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల కార్యవర్గ సభ్యులు తరుచూ సమావేశాలు ఏర్పాటు చేసుకుని లోపాలను సవరించుకోవాలన్నారు. పార్టీలో అసంతృప్తిగా ఉన్నవారిని కలుపుకుని పని చేసుకుంటేనే అనుకున్న లక్ష్యానికి చేరువవుతామని వివరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు ఎర్రం మహేశ్, సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, పోంచేట్టి రాకేశ్, చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రానికి చెందిన మీస లక్ష్మణ్ (58) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మణ్ తన ద్విచక్రవాహనంపై ఈనెల 16న రాగట్లపల్లి వైపు వెళ్తుండగా ఎల్లారెడ్డిపేట వైపు నుంచి వస్తున్న (ఏపీ వి 6139) నెంబర్ గల డీసీఎం వాహనం అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌కు గాయాలుకాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో బుధవారం మధ్యాహ్నం వ్యాన్ ఢీకొని అదే గ్రామంలో నివాసముండే తాపీ మేస్త్రీ బత్తుల బాబురావుకు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా మచ్చిరాలకు చెందిన బాబురావు కొన్ని నెలలుగా దుంపేటలో ఉంటూ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. భవనం నిర్మాణం పనులు చేస్తుండగా రుద్రంగి వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్ రోడ్డు పక్కకు దూసుకువచ్చి బాబురావును ఢీకొంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108లో కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీల కొరత తీర్చాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింగిల్‌విండో, పాలకవర్గం సభ్యులు

చందుర్తి (వేములవాడ) : లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, వెంటనే లారీల కొరత తీర్చాలంటూ అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడుకు చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గం బుధవారం వినతిపత్రం అందజేశారు. పది రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, మిల్లుల వద్ద మూడు, నాలుగు రోజులపాటు ధాన్యాన్ని దించుకోవడం లేదన్నారు. వారం రోజులు కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపిస్తే ధాన్యం కొనుగోళ్ల ముగుస్తాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. లేకపోతే వర్షాలు పడితే మళ్లీ రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇక్కడ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు పుల్కం మోహన్, డైరెక్టర్లు చింతపంటి రామస్వామి, శ్రీహరి రెడ్డి, మొగిలి రవి, పులకం లచ్చయ్య, నాగం శ్రీనివాస్, గుడిసె రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ


వీఓఏలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట : ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీఓఏలకు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో వీఓఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనంతో దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం కనీస వేతనం 18 వేలకు పెంచడంతో పాటు, బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

సిరిసిల్ల అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలకు గురైన బాధితులకు నష్ట పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు ఏమైందని ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ స్పందించి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు అందాల్సిన రిలీఫ్‌ను అందజేయాలని, లేకపోతే నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్వాడి సుదర్శన్, సలహాదారులు మహ్మద్ సద్దాం, జిల్లా నాయకులు నరేశ్, బెస్త నరేశ్, నర్సయ్య, ప్రవీణ్, మల్లారపు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- ఇద్దరిపై కేసు


దాడులు నిర్వహిస్తున్న పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది

సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గుడుంబా స్థావరాలపై బుధవారం సారంగాపూర్ ఎస్సై మనోహర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లంపానకం, తయారీకి వినియోగించే ముడి సరుకు, రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

గొల్లపల్లి: విద్యుత్ తీగలు తగిలి లారీ దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం ఆరెపల్లి నుంచి గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు ఓ రైతు ఎండుగడ్డి తీసుకెళ్తుండగా, గ్రామ శివారులోకి చేరుకోగానే లారీకి విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వచ్చి మంటలు ఆర్పారు. ఎస్సై దత్తాత్రి, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

పది నిమిషాల్లో తిరిగొస్తానని కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు


తిరుపతి మృతదేహం

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ..మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన బుద్దె తిరుపతి (38) స్నేహితుడు విష్ణుతో కలిసి బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై రాయపట్నం ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లొస్తానని ఇంట్లోంచి బయలుదేరాడు. ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో విష్ణుతోపాటు ఆటో డ్రైవర్ నేరెళ్ల రాజేందర్, దూడ వెంకటేశ్‌కు గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. బోల్తాపడిన ఆటోలోని డీజిల్ ట్యాంకు మూత ఊడిపోవడంతో ఆటోకు మంటలంటుకున్నాయి. గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని రోదించారు. పది నిమిషాల్లో తిరిగొస్తానని వెళ్లిన భర్త కానరాని లోకానికి వెళ్లాడంటూ భార్య కన్నీటి పర్యంతమైంది. సంఘటన స్థలాన్ని సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు రిషి, కూతుళ్లు శైనీ, శివాని ఉన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి


క్రాంతి (ఫైల్)


క్రాంతి మృతదేహాన్ని తీసుకువస్తున్న స్థానికులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ వాగులో బుధవారం దుస్స క్రాంతి(33) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృత్యువాతపడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తాడికల్‌కు చెందిన దుస్స క్రాంతి సెల్‌ఫోన్ రిపేర్ చేస్తుంటాడు. గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్ పెడుతుండగా ప్రమాదవాశాత్తు అతడికి తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు మృతదేహాన్ని వాగులోంచి బయటకు తీశారు. మృతుడికి భార్య సింధు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఫిర్యాదు అందలేదని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఈతచెట్లు దగ్ధం



కథలాపూర్: బీమారం మండలకేంద్రం శివారులో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈతచెట్లు కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. 150 కుటుంబాలు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. సుమారు వెయ్యి ఈతచెట్లు దగ్ధమయ్యాయని, దీంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం : జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన ఫిరోజ్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. టీఆర్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అంగడిబజార్ సమీపంలో షాకీర్, సాయి, చోటుతో పాటు మరికొందరు దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతంలో నివసించే మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమో దు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. కృష్ణానగర్‌లో నివాసం ఉండే మహిళ మంగళవారం రాత్రి ఇంట్లో ఉండగా అదే ప్రాంతంలో చికెన్ సెంటర్ నిర్వహించే ఇమ్రాన్ ఇంట్లో చొరబడి సదరు మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై దాడి


గాయపడిన జాన్

జగిత్యాలక్రైం: మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీలో మంగళవారం రాత్రి జాన్ అనే వ్యక్తిపై ముగ్గురు మహిళలతో పాటు మరికొందరు దాడిచేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లా నర్కల్ మండలం చేజర్ల గ్రామానికి చెందిన జాన్ నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న మహిళతో చిన్నపాటి గొడవ జరుగగా ముగ్గురు మహిళలతో పాటు, కొందరు దాడిచేశారు. చికిత్స నిమిత్తం జాన్‌ను స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.